క్లుప్తంగా

మెగా రక్తదాన శిబిరం



రక్తదానం చేస్తున్న యువకులు

బూర్జ: మండలంలోని డొంకలపర్త గ్రామంలో స్వాతంత్య్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని గ్రామ యువత ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరం శుక్రవారం నిర్వహించారు. పాలకొండ రెడ్‌క్రాస్ సొసైటీ ప్రతినిధుల ఆధ్వర్యంలో 34 మంది యువకులు రక్తదానం చేయడం జరిగింది. పాలకొండ ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ చిరంజీవి, డాక్టర్ శివప్రకాష్‌లు రక్తదానం చేసిన వారిని అభినందించారు. కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.

సైబర్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలి



అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ సత్యనారాయణ

పొందూరు: సైబర్ మోసాలపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని ఎస్‌ఐ సత్యనారాయణ సూచించారు. మండలంలోని వావిలపల్లిపేట కూడలికి సమీపంలో ఉన్న ఒక ప్రైవేటు స్కూల్‌లో శక్తి యాప్‌పై శుక్రవారం అవగాహన కల్పించారు. వ్యక్తిగత ఖాతాల నుంచి నగదు డిబిట్ అయినట్లయితే వెంటనే 1930కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలని సూచించారు. అలాగే బాల్య వివాహాలు జరగకుండా రక్షణ కల్పించేందుకు 1098 ఫోన్ చేయాలన్నారు. ఆపదలో ఉన్నప్పుడు మహిళలు శక్తి యాప్‌ను వినియోగించుకొని రక్షణ పొందాలని సూచించారు. మాస్కులు ధరించి వాహనాలు నడిపిన వారిపై జాగ్రత్తగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ పీవీవీ శేషుకుమార్, హెచ్‌ఎం నీలిమ తదితరులు పాల్గొన్నారు.

త్రుటిలో తప్పిన పెను ప్రమాదం



ప్రమాదంలో నుజ్జునుజ్జయిన కారు ముందరి భాగం

మెళియాపుట్టి: మండలంలోని పెద్ద లక్ష్మీపురం గ్రామం వద్ద ఒక కారు అదుపుతప్పి కరెంట్ స్తంభానికి ఢీకొంది. వివరాల్లోకి వెళ్తే.. పలాస నుంచి చాపర గ్రామానికి దంత వైద్యుడు ఎస్.హరిప్రసాద్ ప్రతిరోజూ వస్తుంటారు. ఆయన ఎప్పటిలాగే గురువారం ఒడిశాలోని గారబంద మీదుగా వస్తుండగా, ఒక్కసారిగా కుక్క అడ్డంగా రావడంతో రహదారి పక్కనే ఉన్న కరెంటు స్తంభానికి ఢీకొని కారు ఆగిపోయింది. అయితే ఎయిర్ బెలూన్స్ తెరుచుకోవడంతో ప్రాణాలతో బయటపడినట్లు వైద్యుడు హరిప్రసాద్ తెలిపారు.

బాధ్యతల స్వీకరణ



రవణమ్మ

పాతపట్నం: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఆర్‌ఐగా పెద్ద బొంతు రవణమ్మ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈమె పలాస తహసీల్దార్ కార్యాలయంలో ఎలక్షన్ సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తూ బదిలీలో భాగంగా ఇక్కడకి వచ్చారు. ఇదివరకు ఇక్కడ పనిచేసిన ఆర్‌ఐ పండిత బాబీ ఇక్కడే సీనియర్ అసిస్టెంట్‌గా బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేసిన సీనియర్ అసిస్టెంట్ వైకుంఠరావు పదవీ విరమణ చేశారు. దీంతో వీరికి సిబ్బంది అభినందనలు తెలిపారు.

రహదారి విస్తరణలో వివక్షత

సరుబుజ్జిలి: సరుబుజ్జిలి జంక్షన్‌లో నాలుగువైపులా రహదారుల విస్తరణలో అధికారులు వివక్షత ప్రదర్శిస్తున్నారని పలువురు వాపోతున్నారు. కొలతలు వేసే సమయంలో రహదారి మధ్య భాగం నుంచి రెండువైపులా సమానంగా మార్కింగ్ చేయాలి. కానీ అలా కాకుండా కొంతమంది నేతల ఒత్తిళ్ల మేరకు ఒక్కోచోట ఒక్కోవిధంగా సంబంధిత యంత్రాంగాలు భూమిని మార్కింగ్ చేస్తున్నాయని తెలిపారు. దీనివలన విలువైన జిరాయితీ భూములను కోల్పోవాల్సిన పరిస్థితులు ఉన్నాయని వాపోతున్నారు. అధికారులు రహదారి విస్తరణ సమయంలో సమన్యాయంతో వ్యవహరించాలని కోరుతున్నారు.



నరసన్నపేట: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో...



పాతపట్నం: వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో జెండాకు సెల్యూట్ చేస్తున్న నాయకులు



జలుమూరు: మండల పరిషత్ కార్యాలయంలో...



పొందూరు: కోర్టు ఆవరణలో జెండా ఎగురవేస్తున్న జడ్జి జ్యోత్స్న



ఆమదాలవలస: కోర్టు ఆవరణలో జెండా ఆవిష్కరిస్తున్న జడ్జి రమ్య

జెండా.. మదినిండా

ఆమదాలవలస, నరసన్నపేట, పాతపట్నం నియోజకవర్గాల్లో స్వాతంత్య్ర దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాలు, విద్యా సంస్థల్లో మువ్వన్నెల జెండా రెపరెపలాడింది. 79వ స్వాతంత్య్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని జాతీయ పతాకాన్ని ఎగురవేసి గౌరవ వందనం సమర్పించారు. స్వాతంత్య్ర సమరయోధులు, దేశ భక్తుల త్యాగాలను గుర్తు చేసుకున్నారు.

– సాక్షి నెట్‌వర్క్



ఆమదాలవలస: జాతీయ పతాకాన్ని ఎగురవేస్తున్న చింతాడ రవికుమార్ తదితరులు



పాతపట్నం: ప్రహరాజపాలేం గురుకుల పాఠశాలలో విద్యార్థినుల విన్యాసాలు



పోలాకి: మండల పరిషత్ కార్యాలయంలో జెండా ఆవిష్కరిస్తున్న దృశ్యం



పాతపట్నం: మండల పరిషత్ కార్యాలయం వద్ద జెండాకు సెల్యూట్‌కు చేస్తున్న నాయకులు, అధికారులు



కొత్తూరు: జూనియర్ సివిల్ జడ్జి కోర్టు ఆవరణలో...



హిరమండలం: ఎల్‌ఎన్‌పేట తహసీల్దార్ కార్యాలయంలో...



హిరమండలం: మండల పరిషత్ కార్యాలయంలో...



నరసన్నపేట: మండల పరిషత్ కార్యాలయంలో...



కొత్తూరు: గాంధీజీ విగ్రహానికి పూలమాల వేస్తున్న తహసీల్దార్ బాలకృష్ణ



సరుబుజ్జిలి పీహెచ్‌సీ వద్ద...



కొత్తూరు: మండల పరిషత్ కార్యాలయంలో...



మెళియాపుట్టి: మండల పరిషత్ కార్యాలయంలో...



ఆమదాలవలస: కన్యకా పరమేశ్వరి ఆలయం ఆవరణలో...



బూర్జ: ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో...



సరుబుజ్జిలి: పురుషోత్తపురం సచివాలయం వద్ద...



నరసన్నపేట: మేజర్ పంచాయతీ కార్యాలయంలో...



సారవకోట: తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో...

బోధనేతర పనులు ఆపకుంటే ఉద్యమిస్తాం

ఆమదాలవలస/ఆమదాలవలస రూరల్:

ఉపాధ్యాయులు పాఠాలు బోధించకుండా తరగతికి దూరం చేయడమే కూటమి ప్రభుత్వ విధానంలా కనిపిస్తోందని ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు ఎస్వీ రమణమూర్తి ప్రభుత్వాన్ని విమర్శించారు. శుక్రవారం పట్టణంలోని మండల విద్యాశాఖ కార్యాలయం వద్ద ఎస్టీయూ నాయకుల ప్రాంతీయ సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మూల్యాంకనం కోసం కొత్తగా ప్రవేశపెట్టిన అసెస్మెంట్ బుక్‌లను ప్రస్తావిస్తూ సరికాదన్నారు.

దీనివలన ఒక్కో ఉపాధ్యాయుడు వందలాది పేజీలు రాయాల్సి ఉంటుందన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి జి.రమణ, సీనియర్ నాయకులు పి.ప్రభాకర్‌రావు, జిల్లా కార్యవర్గ సభ్యులు పి.రామకృష్ణ హనుమంతు, సత్యం, ఎం.రమేష్ తదితరులు పాల్గొన్నారు.

మండల సర్వసభ్య సమావేశం నేడు

సారవకోట: స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో మండల సర్వసభ్య సమావేశం శనివారం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో మోహన్ కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశానికి మండల స్థాయి అధికారులు తగిన సమాచారంతో తప్పనిసరిగా హాజరవ్వాలని కోరారు.

సెలవు రోజు తనిఖీలకు రావడమేంటి..?

- అధికారులను అడ్డుకున్న హాస్టల్ వార్డెన్



విద్యార్థినులతో మాట్లాడుతున్న అధికారులు

పాతపట్నం: స్థానిక ఆర్‌అండ్‌బీ బంగ్లా పక్కనున్న ప్రభుత్వ ఎస్సీ బాలికల వసతి గృహాన్ని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆదేశాల మేరకు తనిఖీ చేసేందుకు మండల అధికారులు శుక్రవారం సాయంత్రం వెళ్లారు. అయితే హాస్టల్ గేటుకు వేసిన తాళం తీయకుండా వార్డెన్ బి.శ్యామల అధికారులైన తహసీల్దార్ ఎన్.ప్రసాదరావు, ఎంపీడీవో పి.చంద్ర కుమారి, ఏఎస్‌డబ్ల్యూవో ఎం.శ్యామలను బయటనే ఉంచారు. సెలవు రోజుల్లో హాస్టల్‌కు రావడమేంటని ఎదురు ప్రశ్నలు వేశారు. దీంతో వెంటనే తహసీల్దార్ ప్రసాదరావు ఎస్‌ఐ బి.లావణ్యకు సమాచారం ఇచ్చారు. వెంటనే ఎస్‌ఐ తన సిబ్బందితో హాస్టల్‌కు చేరుకుని తాళం తీయించారు.

వార్డెన్ వేధిస్తున్నారు

ఈ హాస్టల్‌లో 4వ తరగతి నుంచి 10వ తరగతి వరకు చదువుతున్న మొత్తం 44 మంది విద్యార్థినులు ఉన్నారు. దీంతో వీరి వద్దకు అధికారులు వెళ్లి మాట్లాడారు. అయితే వార్డెన్ తమను వేధిస్తోందని విద్యార్థినులు తమ సమస్యలను ఏకరువు పెట్టారు. తరుచూ కొడుతోందని, సక్రమంగా భోజనం పెట్టడం లేదని వాపోయారు. ఏమైనా ప్రశ్నిస్తే తమ తల్లిదండ్రులకు తమపై లేనిపోని చాడీలు చెబుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే వారానికి ఒకటి లేదా రెండు రోజులు మాత్రమే హాస్టల్‌కు వస్తుందని పేర్కొన్నారు. వచ్చిన రోజుల్లో వేధిస్తుందని తెలిపారు. మెనూ సక్రమంగా పెట్టడం లేదని, పెట్టిందే తినాలని చెబుతుందని ఆరోపించారు. కాగా కలెక్టర్‌కు సాంఘిక సంక్షేమ జిల్లా అధికారులు ఫిర్యాదు చేయడంతో ఆయన ఆదేశాల మేరకు తనిఖీ చేయడానికి వచ్చామని తహసీల్దార్ తెలిపారు. విద్యార్థుల సమస్యలను ఉన్నతాధికారులకు నివేదిస్తామన్నారు.

తీరప్రాంతాల్లో..

పడకేసిన పారిశుద్ధ్యం..!

- విజృంభిస్తున్న విష జ్వరాలు
- మంచాన పడుతున్న ప్రజలు
- పట్టించుకోని అధికారులు



విషజ్వరాలతో అల్లాడుతున్న గుల్లవానిపేట




గుప్పెడుపేట అంగన్‌వాడీ కేంద్రం ఆవరణలో అపారిశుద్ధ్యం

పోలాకి: మండలంలోని తీరప్రాంత గ్రామాల్లో పారిశుద్ధ్యం పడకేసింది. గుప్పెడుపేట, గుల్లవానిపేట, కొత్తరేవు, రాజారాంపురం, రేవు అంపలాం, కొవిరిపేట, జోగంపేట తదితర గ్రామాల్లోని వీధుల్లోకి వెళ్లాలంటే ముక్కు మూసుకోవాల్సిన పరిస్థితి దాపురించిందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల విషజ్వరాలు వ్యాప్తి చెందడంతో అధికారులు తూతూమంత్రంగా బ్లీచింగ్ పౌడర్ చల్లి, దోమల నివారణ మందు స్ప్రే చేసి చేతులు దులుపుకున్నారు. ఆయా గ్రామాల పరిధిలోకి వచ్చే ఆరోగ్య సిబ్బంది అందుబాటులో ఉన్న అరకొర మందులతో వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. అనంతరం జ్వరాలు కొంతమేర అదుపులోకి వచ్చిన తర్వాత పట్టించుకోవడం లేదని మత్స్యకారులు ఆరోపిస్తున్నారు.

పంచాయతీ కార్యదర్శులకు పట్టదా..?

స్థానికంగా ఉన్న సచివాలయ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు పారిశుద్ధ్యంపై పట్టనట్లు వ్యవహరిస్తున్నారని తీరప్రాంత గ్రామాలకు చెందిన ప్రజాప్రతినిధులు ఆరోపిస్తున్నారు. ఇదే విషయంపై ఇటీవల జరిగిన మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో సైతం అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. కొత్తరేవు పంచాయతీ సెక్రటరీ డిప్యూటేషన్‌పై ఉండడంతో ఇన్‌చార్జి పాలనతో అక్కడి పరిస్థితి మరీ అధ్వానంగా ఉంది. అంపలాం పంచాయతీలో డ్రైనేజీలు దారుణంగా ఉన్నాయని, అనేక మార్లు విన్నవించినా పట్టించుకునేనాథుడే లేరని గ్రామస్తులు వాపోతున్నారు. మరోవైపు గుల్లవానిపేట పంచాయతీలో నేటికీ వంద మందికి పైగా జ్వర పీడుతులు ఉన్నట్లు గ్రామస్తులు చెబుతున్నారు. ఇక అతిపెద్ద మత్స్యకార గ్రామం గుప్పెడుపేటలో అంగన్‌వాడీ కేంద్రానికి అనుకుని అపారిశుద్ధ్యం విలయతాండవం చేస్తోంది.


చర్యలు తీసుకోండి



తీరప్రాంత గ్రామాల్లో పారిశుద్ధ్యం దారుణంగా తయారైంది. ఇటీవల విషజ్వరాలు వ్యాప్తి చెంది వందలాది మంది మంచాలకే పరిమితమయ్యారు. ఇప్పటికీ ప్రతి గ్రామంలో పదుల సంఖ్యలో జ్వర పీడితులు ఉన్నారు. వచ్చేది పూర్తిగా వర్షాకాలం కావడంతో ముందస్తు చర్యలు తీసుకోవాలని అధికారులను కోరుతున్నాం. ఆరోగ్య సిబ్బంది సైతం పట్టించుకోవడం లేదు. పేద మత్స్యకారులు అనేక మంది ప్రైవేటు వైద్యంతో ఆర్థికంగా చితికిపోతున్నారు.

– లండ యర్రయ్య, మత్స్యకార సంఘ నాయకుడు, గుప్పెడుపేట

మత్స్యకార గ్రామాలంటే చిన్నచూపు



మత్స్యకార గ్రామాలంటే అధికారులు, నాయకులు అందరికీ చిన్నచూపే. తీరంలో ఏ గ్రామానికి వెళ్లినా అపారిశుద్ధ్యం విలయతాండవం చేస్తోంది. మా గ్రామంలో అంగన్‌వాడీ కేంద్రంతో పాటు గ్రామానికి వచ్చే ప్రధాన రహదారిపైనా పరిస్థితి అధ్వానంగా ఉంది. పంచాయతీ కార్యదర్శి, మండల అధికారులు పట్టించుకోవడం లేదు. పారిశుద్ధ్య లోపంతో విషజ్వరాలు విజృంభిస్తున్నాయి.

– తులే పైడమ్మ, ఎంపీటీసీ సభ్యురాలు, గుప్పెడుపేట

భక్తిశ్రద్ధలతో వరలక్ష్మీ వ్రతాలు

జలుమూరు: దక్షిణ కాశీగా పేరుగాంచిన శ్రీముఖలింగం ప్రధాన ఆలయంలో వారాహి అమ్మవారికి శ్రావణ మాసం నాలుగో శుక్రవారం వరలక్ష్మీ వ్రతాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందుగా గణపతి పూజతో ప్రారంభించి, అమ్మవారికి అర్చనలు, దర్శనాలు, ఏకవార అభిషేకాలు, కుంకుమ పూజలు చేపట్టారు. అమ్మవారికి నూతన వస్త్రాలు, పిండి వంటలు సమర్పించి మొక్కులు తీర్చారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.